క్లుప్తంగా

విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీ



దాతలిచ్చిన స్వెట్టర్లు ధరించిన విద్యార్థులు

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ పాటిగరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రెడ్డి నారాయణ రావు ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుడు ఆర్.పి.ఎస్.వి.ప్రభాకర్, లక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో సోమవారం విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. దాత సేవలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం తెలిపారు. శీతాకాలం ప్రారంభానికి ముందస్తుగా విద్యార్థులకు స్వెట్టర్లు అందజేయడం చాల సంతోషకరమని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. హెచ్ఎం పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారిని బాగుచేయండి



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత శ్రీను

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో గుమ్మసిరగంపుట్టు వద్ద వర్షాలకు కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డును బాగు చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను కోరారు. సోమవారం కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డు పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంఎంశ్రీను మాట్లాడుతూ గుమ్మసిరగంపుట్టు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదభరితంగా ఉందన్నారు. ఎప్పుడు ఏ వాహనం ప్రమాదానికి గురవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనచోదకులు నిత్యం భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ రహదారి కోతకు గురై నెల రోజులు కావస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ మార్గంమీదుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా విస్మరించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. ఈ మార్గంలో ప్రమాదం జరగకముందే ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఆయాలతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

డుంబ్రిగుడ: మండల పరిధిలో వివిధ ప్రాథమిక ఉన్నత ప్రాభుత్వ పాఠశాలల్లో పనులు చేస్తున్న ఆయాలకు సకాలంలో వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 169 పాఠశాలల్లో పనులు చేస్తున్న సుమారు 120 మంది ఆయాలకు ఆరు మాసాలుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, అప్పులు చేసి కుటుంబాలు పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఆరు మాసాల వేతనాలు విడుదల చేయాలని లేని పక్షంలో ఆయాలతో ధర్నాలు, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయాలు శాంతి, పూర్ణిమ్మ, సుమిత్ర, తులవతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మాలిని

సాక్షి,పాడేరు: ఆదివాసీ మాతోట మ్యాక్స్ పరస్పర సహకార సంఘాన్ని మినుములూరులో గిరిజన మహిళలంతా సోమవారం ఘనంగా ప్రారంభించారు. చైతన్య స్రవంతి సంస్థ డైరెక్టర్ మాలిని మహిళలకు అకౌంట్ పుస్తకాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు.ఆదివాసీ మాతోట మ్యాక్స్ సంస్థ గిరిజన రైతులకు నాణ్యమైన మార్కెటింగ్ సేవలతో పాటు వ్యాపార రంగంలోను రాణించి, ఆర్థికాభివృద్ధి సాధించాలి మాలిని కోరారు. సంస్థ సీఈవో లోచలి ధనుంజయుడు, విశాఖకు చెందిన న్యాయవాది రాకేష్, పలు ప్రాంతాల ఎఫ్‌పీవోలు కొండబాబు, నగేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వర్షాలతో తడిసిపోయిన వేరుశనగ కాయలను సేకరిస్తున్న రైతులు



డుంబ్రిగుడలో వేరుశనగ పంట

అకాల వర్షాలు.. రైతుల దిగులు

- రోజుల తరబడి వానతో పాడైపోతున్న వేరుశనగ పంట
- కాయ దశ పూర్తికాకుండానే సేకరణ
- నష్టాలతో ఆందోళన
- పట్టించుకోని యంత్రాంగం



వేరుశనగ కాయలను సేకరిస్తున్న మహిళలు



పాడైన వేరుశనగ దుబ్బులు

డుంబ్రిగుడ: మండలలోని గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎంతో ఆశతో వేలల్లో డబ్బులు ఖర్చుపెట్టి ఆయా వాణిజ్య పంటలను పండిస్తున్నారు. ఇందులో భాగంగానే డుంబ్రిగుడ మండల గిరిజన రైతులు వేరుశనగ పంటను వేసిన సమయంలో వర్షాలు లేక సుమారు రెండు మాసాలు ఎదురు చూశారు. వర్షాలు పడకపోయిన పంట కాస్త చేతికి వస్తుందనే సమయంలో ఆకాల వర్షాలతో చేతికి వచ్చిన వేరుశనగ పంట కాస్తా బుడిదలో వేసినా పన్నీరుగా మారింది. మండలంలోని కురిడి, సాగర, సొవ్వా, కండ్రుమ్, గుంటసీమ, రంగిలిసింగి, తూటంగి, గుంటగన్నేలు, గసభ, కొల్లాపూట్టు, కితలంగి పంచాయితీలలో సుమారు 119 హెక్టర్లలో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఎంటువంటి ప్రోత్సహం లేక పోయిన పక్క రాష్ట్రం నుంచి విత్తనాలు కొనుగోలు చేసి వారివారి భుముల్లో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం వర్షాలు విపరీతంగా కురుస్తుండడంతో పంటలో వరదనీరు చేరి వేరుశనగ పిందె దశ నుంచి పరిమాణం పెరగకుండా కుళ్లి పోతుందని గిరిజన రైతులు ఆవేదన చేందుతున్నారు. కొంత మంది గిరిజన రైతులు వచ్చిన పంటతోనే సరి పెట్టుకుని పంట పాడవ్వకుండ ఉండేందుకు వారి వారి గరువుల నుంచి వేరుశెనగను సేకరించి వచ్చిన ధరలతోనే విక్రయిస్తున్నారు. లేకపోతే పంట వర్షలకు పూర్తిగా పాడై మరింత నష్ట పోతున్నామని గిరిజన రైతులు వాపోతున్నారు. మంచి కాయ దశలో ఉన్న వేరుశనగ క్వింటా రూ.2000 ఉండగా, ప్రస్తుతం కాయ పరిమాణం తగ్గి పోతుండడంతో పాటు కొంత పొట్టు కాయలు రావడంతో క్వింటాకు రూ.1200 నుంచి రూ.1500 వరకు ధరారులు అమ్మకాలు చేయాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్ట పోతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సహం లేదని, కనీసం సాగు పెట్టుబడిని ప్రభుత్వం అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాంగం, అధికారులు తమ దుస్థితిపై దృష్టి సారించి రైతులు పండిస్తున్న వాణిజ్య పంటలపై, వాటి నష్టాలపై అంచన వేసి న్యాయం చేయాలని వైరుశనగ తదితర వాణిజ్య పంటల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి



సుమారు రూ.30వేలు ఖర్చు పెట్టి పంట వేశాం. విత్తనాలు వేసే సమయానికి వర్షాలు లేవు, సాగు ఎలాగనే దిగాలుతో ఉన్నాం. ఇప్పుడు పంట కాస్త చేతికి వస్తుందనే సమయంలో ఆకాల వర్షంతో పంటలోని వేరులకు నీరు చేరి పంట పూర్తి నష్టం వస్తుంది. కొంత భాగం కుళ్లిపోతున్నాయి. దీంతో దిగుబడి తగ్గిపోతుంది. మా కష్టానికి తగ్గ పలితం రాకపోవచ్చు. అధికారలు స్పందించి నష్ట పరిహారం కల్పించాలి.

–పూజారి.రాము, నారింగవలస, కురిడి పంచాయతీ

రైతులకు సూచనలు, సలహాలు



పంట పాడవ్వకుండ ఉండేందుకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ట్రైయికోడర్మ్ విరిడి (టివిడి) లభిస్తుంది. ఆర కిలో పౌడర్‌ను నీరులో కలిపి సుమారు 2 ఎకరాలకు పిచాకారీ చేస్తే పంట కుళ్లిపోకుండా ఉంటుంది. లేక వంద కేజీల గత్తంలో రెండు కిల్లోలు పౌడర్‌ను కలిపి పంట మొక్క మోదలులో వేయాలి. ఇలా చేయడంతో కూడా పంట కుళ్లి పోకుండా ఉంటుంది. మరో పద్ధతిలో పౌడర్ మాత్రమే మొక్క మోదల్లో వేసినా మొక్కలు పాడవ్వకుండా ఉంటాయి. క్షేత్రస్థాయి సిబ్బంది పంటలను పరిశీలించి, రైతులకు తగు సూచనలు, సలహాలు అందించేలా చూస్తున్నాం.

– సీహెచ్.నీలవేణి, వ్యవసాయ అధికారి, డుంబ్రిగుడ

కళాశాల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి కోరారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. కళాశాల అభివృద్ధి కోసం రూ.3కోట్ల రోసా నిధులతో ప్రతిపాదన పంపించినట్టు తెలిపారు. సుమారు 25 ఎకరాల్లో ఉన్నటువంటి మైదానంలో సుందరీకరణ చేపట్టేందుకు వివిధ మొక్కలను పెంచడానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు వివిధ రకాల పుస్తకాలతో గ్రంథాలయం ఆధునికీకరణ, ల్యాబ్‌ను అందుబాటులో ఉంచనున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పేరొందిన డిగ్రీ కళాశాలలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతల సాయం చేయాలని కోరారు. అధ్యాపకులు నాగేశ్వరరావు, జగదీష్, లీలబాను, శ్రీనివాసు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

72 మందికి పరీక్షలు



పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం విశాఖలోని వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్టు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్(హైదరాబాద్) వారిచే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 72 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నట్టు ట్రస్ట్ ప్రతినిధి కనకేశ్వరరావు తెలిపారు. శిబిరంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము, వైద్యులు మణికంత, గౌతమ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల నియామకం



వై.రామవరం తహసీల్దార్ అనసూయ



గంగవరం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసు

గంగవరం : గంగవరం రెగ్యులర్ తహసీల్దార్‌గా చిన్నం శ్రీనివాసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా గంగవరం తహసీల్దార్‌గా శ్రీనివాసును నియమిస్తు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు నుంచి శ్రీనివాసు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

వై.రామవరం: వై.రామవరం మండల తహసీల్దార్‌గా కోసు అనసూయ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె విజయవాడ నుంచి బదిలీపై వై.రామవరం వచ్చారు. ఆమె స్వగ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతు తోటి గిరిజనులకు సేవలు అందించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటు సేవలు అందిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది అంతా మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకతతో సకాలంలో సేవలందించాలని సలహాలు సూచనలు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర రావు, మండల సర్వేయర్ వేణుగోపాల్, ఆర్ఐ గీత విలాప, సీనియర్ అసిస్టెంట్ తాతారెడ్డి, వీఆర్ఓలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



డుంబ్రిగుడ జంక్షన్‌లో విద్యార్థుల మానవహారం

- వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ర్యాలీలు



పాడేరులో నిరసన కార్యక్రమం చేపట్టిన చైతన్య స్రవంతి డైరెక్టర్ మాలిని, గిరిజన మహిళలు



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

సాక్షి,పాడేరు: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని చైతన్య స్రవంతి సంస్థ డైరెక్టర్ ఎం.మాలిని కేంద్రంతో పాటు పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గిరిజన మహిళలతో కలిసి సోమవారం స్థానిక పాతబస్టాండ్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితులను వెంటనే శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా మహిళలకు రక్షణ కల్పించాలని వారంతా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ ఈ సంఘటనను దేశవ్యాప్తంగా మహిళా లోకం ఖండిస్తోందన్నారు. జిల్లాలోని ఆదివాసీలు కూడా సంఘీభావం తెలుపుతున్నారన్నారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన పాశవికమన్నారు. ఈఘటనపై సీబీఐతో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పలు సంఘాల ప్రతినిధులు కాసులమ్మ, కాంతమ్మ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో రాష్ట్ర మానవ హక్కుల నేర నిరోధక ఏజెన్సీ మహిళా విభాగ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ చేపట్టారు. వైద్యురాలి హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని, ఎన్‌హెచ్516 హైవే రోడ్డులో మానవహారం నిర్వహించారు. డుంబ్రిగుడ వైద్యాధికారి రాంబాబు, కళాశాల ఇన్‌చార్జి పిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : కోల్‌కతాలోని డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ గంగవరం, పెదతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు భావన, సాయిరతన్ ఆధ్వర్యంలో సోమవారం గంగవరంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా రాఖీ పండగ



కూనవరం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వాణికి రాఖీ కడుతున్న విద్యార్థినులు



గరుడాపల్లిలో సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు



జి.మాడుగులలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

అరకులోయటౌన్/హుకుంపేట/జి.మాడుగుల: సోదర, సోదరీమణుల అప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. అన్నా, తమ్ములకు , అక్కా చెల్లెమ్మలు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా, తమ్ముల ఆశీర్వాదం తీసుకోని ఆనందంగా గడిపారు. సోదరీమణుల మీద ప్రేమతో సోదరులు ఆనందంతో కొత్త దుస్తులు, నగదు బహుమతులు, కానుకలు అందజేశారు. వాడవాడలా రాఖీ పండుగ సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి సైతం తోబుట్టువులు వచ్చి అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి సోదర బంధాన్ని, అప్యాయతను చాటుకున్నారు. అన్నా, చెల్లిళ్లు, అక్కా తమ్ముళ్లతో ప్రతీ ఇల్లు సందడిగా మారింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోదర, సోదరీమణులకు సామాజిక మాధ్యమాల అరకులోయలోని కేజీబీవీ విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

డుంబ్రిగుడ: మండలంలో రక్షబంధన్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నా చెల్లెలు అయినటువంటి అరకులోయ మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు డుంబ్రిగుడ జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. పర్యాటక ప్రదేశం చాపరాయిలో సైతం రాఖీ పండగ సందడి కనిపించింది.

కూనవరం: స్థానిక ఏపీఆర్ గురుకుల పాఠశాలలోని రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు పాఠశాలలోని గురువులకు, అక్కడికి వచ్చిన పలువురు పెద్దలకు రాఖీకట్టి, స్వీట్లు పంచి అప్యాయతను చాటుకున్నారు. ప్రిన్సిపాల్ వాణి, బీజేపీ నాయకులు ఎన్. వెంకట రామారావు, ఎన్. సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి, దాకరాయి, శరభవరం, వణకరాయి, బోయపాడు వంటి లోతట్టు గ్రామాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ సంస్థ సమరసత సేవా ఫౌండేషన్ (ఏపీ) ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ పండుగ ఘనంగా జరిగింది. మండల కన్వీనర్ చోడి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం, రాఖీ పండగ సందర్భంగా ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు లచ్చిరెడ్డితో పాటు దొర, వెంకటేశ్వర్లు దొర, వెంకటరెడ్డి, నాగన్న దొర, స్వామిరెడ్డి తదితరులు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్‌లను కలసి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిరాఖీలు కట్టారు.



అరకులోయలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలానికి రాఖీ కడుతున్న ఆదివాసీ నాయకులు



అరకులోయ మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు రాఖీ కడుతున్న డుంబ్రిగుడ జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ



జి.మాడుగులలో రాఖీలు కడుతున్న విద్యార్థులు



అమ్మిరేఖలలో ఒకరికొకరు రాఖీ కడుతున్న గ్రామస్తులు



అమ్మిరేఖలలో రాఖీలు పంపిణీ చేస్తున్న సమరసత ఫౌండేషన్ సభ్యులు

ఆశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



బాధిత విద్యార్థులను పరామర్శిస్తున్న గిరిజన సమాఖ్య, సీపీఐ నాయకులు

సాక్షి,పాడేరు: కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతిచెందడం, మరో 50మంది వరకు ఆస్పత్రి పాలైన సంఘటనపై ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సమాఖ్య, సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేతలు రాధాకృష్ణ, చంటిబాబు, లక్ష్మణరావులు సోమవారం జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధిత విద్యార్థులను పరామర్శించారు. ముగ్గురు గిరిజన విద్యార్థుల మరణాలు బాధాకరమని, ప్రభుత్వం రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముగ్గురు విద్యార్థుల మరణాలకు కారణమైన ఆశ్రమ నిర్వాహకులపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటి కేసులు నమోదు చేయాలని, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అనాథ గిరిజన పిల్లలకు పాడేరు ఐటీడీఏ ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోగులకు రొట్టెలు, పండ్ల పంపిణీ



రోగులకు రొట్టెలు, పండ్లు అందజేస్తున్న వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్, ఫొటోగ్రాఫర్లు

జి.మాడుగుల: ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్, మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు జాన్‌రాజ్ తదితరులు రొట్టెలు, పండ్లును పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్, ఫొటోగ్రాఫర్లు రామ్, నారాయణరాజు, సింహాచలం, రాజా, కృష్ణ, బాలు, పవన్, చలం పాల్గొన్నారు.